

ఎకరానికి రూ. 25 వేలివ్వాలి

వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- 10లో ▸



భారీ మెజారిటీతో గెలిపించాలి

జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
38.4 /21.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

21 నుంచి ఆర్ష గురుకులంలో యువ నిర్మాణ శిబిరం

కామారెడ్డి అర్బన్: పాతరాజంపేట ఆర్ష గురుకులంలో ఈనెల 21వ తేదీ నుంచి 28 వరకు యువ నిర్మాణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్ష గురుకులం ప్రతినిధి హరిదాస్ ఆర్య తెలిపారు. స్వామి బ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో యువకులకు యోగా, కర్ర, కత్తిసాము, ఆటపాటలు, బ్రహ్మ, దేవయజ్ఞం నేర్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఇతర వివరాల కోసం 98492 59011 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీటిని సద్వినియోగం చేసుకోవాలి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మీకాలువ ద్వారా కొనసాగుతున్న ప్రతి నీటి చుక్కను ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ సురేశ్ సూచించారు. శుక్రవారం ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి ఎత్తిపోతల ద్వారా నీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి దశలో పంటలు ఎడిపోవద్దని ప్రభుత్వం ఆఖరు తడి కింద నీటి విడుదలను ప్రారంభించిందన్నారు. కాలువ ద్వారా నీటి వృథా చేయకుండా ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈఈ శేఖర్ బాబు ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు ఆఖరు తడికోసం కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 272 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా తాగు నీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1058.9 అడుగుల(12.4 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

రూ. 7.21 లక్షలు స్వాధీనం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మగుట్ట వద్ద శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి వద్ద రూ. 7.21 లక్షలు లభించాయని సీఐ నరహరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, పట్టణ సీఐ నరహరితో పాటు నాలుగో టౌన్ పోలీసులు శుక్రవారం ఎల్లమ్మగుట్ట వద్ద తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేకుండా మోర దీపక్ అనే వ్యక్తి రూ. 7.21 లక్షలను తరలిస్తుండడాన్ని గమనించి, అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును నిజామాబాద్ ట్రెజరీలో డిపాజిట్ చేసి గ్రీవెన్స్ కమిటీకి సమాచారం అందించారు. తనిఖీల్లో ఎస్సై సంజీవ్, ఏఎస్సై రామకృష్ణ, కానిస్టేబుల్ అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం సేకరణ సజావుగా సాగాలి'

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై శుక్రవారం సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ, ధాన్యం సేకరణ తీరును పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

కిస్సా కుర్సీకా..?



కామారెడ్డి బల్దియా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. అన్ని పార్టీలు చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తుండడంతో రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ నుంచి ఇద్దరు చైర్‌పర్సన్ స్థానాన్ని ఆశిస్తుండడంతో ఆ పార్టీ కౌన్సిలర్లు రెండుగా చీలిపోయినట్టు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ కూడా అభ్యర్థిని బరిలో నిలిపేందుకు రెడీ అయ్యింది. అవకాశం కోసం బీజేపీ సైతం పావులు కదుపుతుండడంతో చైర్‌పర్సన్ పీఠం ఎవరిని వరిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

- ఆసక్తికరంగా కామారెడ్డి బల్దియా పాలిటిక్స్!
- చైర్‌పర్సన్ పీఠంపై అన్ని పార్టీల కన్ను
- కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఆశావహులు..
- బరిలో నిలిచేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు
- అవకాశం కోసం చూస్తున్న బీజేపీ

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు 27 మంది అవిశ్వాసం ప్రవేశపెట్టగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన పది మంది అనుకూలంగా వ్యవహరించారు. దీంతో జాహ్నవి చైర్‌పర్సన్ పదవి కోల్పోవాల్సి వచ్చింది. కొత్త చైర్‌పర్సన్‌ను ఈనెల 15న ఎన్నికోనున్నారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ పీఠంపై పలువురు కన్నేశారు. బీఆర్‌ఎస్ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొంది అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చైర్‌పర్సన్ స్థానం కోసం ప్రయత్నిస్తున్నారు. అలాగే ఇండిపెండెంట్‌గా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరి, తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఉర్దొండ వనిత కూడా చైర్‌పర్సన్ పీఠం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీంతో కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఉన్న 27 మంది కౌన్సిలర్లు రెండు వర్గాలుగా చీలిపోయినట్టు తెలుస్తోంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ మాత్రం ఎవరూ సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, హైకమాండ్ నిర్ణయించిన వారినే చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని కౌన్సిలర్లకు స్పష్టం చేసినట్టు సమాచారం. ముందస్తుగా కౌన్సిలర్లను క్యాంపులకు సైతం తరలించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఖరారు..

చైర్‌పర్సన్ ఎన్నిక కోసం బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంప గోవర్ధన్ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. అయితే పార్టీలో ఉన్న 16 మంది కౌన్సిలర్లను సమావేశానికి పిలవగా 10 మంది మాత్రమే హాజరైనట్టు తెలిసింది. వారిలో మదూరి అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా నిర్ణయించినట్లు సమాచారం.

'మెజారిటీ' ఎవరి పక్షమో!?

కామారెడ్డి బల్దియాలో 49 మంది కౌన్సిలర్లు ఉన్నారు. చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావాలంటే 25 మంది సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. కాగా బీఆర్‌ఎస్‌లో 16 మంది మాత్రమే మిగిలారు. అందులోనూ మాజీ చైర్మన్ నిట్టు జాహ్నవితో కలిపి ఆరుగురు సభ్యులు పార్టీకి దూరంగా ఉన్నారు. దీంతో బీఆర్‌ఎస్ బలం పదికి తగ్గిపోయినట్లే.. బీజేపీలో ఆరుగురు కౌన్సిలర్లే ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యుడితో కలిపి ఆ పార్టీ బలం ఏడు మాత్రమే. కాంగ్రెస్‌నుంచి ఇద్దరు వ్యక్తులు చైర్‌పర్సన్ పీఠం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకవేళ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 27 మంది సభ్యులు రెండుగా చీలిపోయి.. ఎన్నికల్లో ఎవరికి వారు బరిలో దిగితే అప్పుడు రాజకీయాలు మారవచ్చని భావిస్తున్నారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవిని పదవి నుంచి దింపడానికి వ్యూహాత్మకంగా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకత్వం చైర్మన్ ఎన్నికను అంత ఈజీగా తీసుకోదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక అన్నది ప్రతిష్టాత్మకమే.. చైర్మన్‌గా ఫలానా వ్యక్తిని కాకుండా మరొకరిని ఎంపిక చేయాలని కొందరు కౌన్సిలర్లు షబ్బీర్ అలీ దగ్గరకు వెళ్లగా ఆయన పార్టీ హైకమాండ్ ఎవరిని నిర్ణయిస్తే వారికే మద్దతు ఇవ్వాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో సదరు కౌన్సిలర్లు నిరాశతో వెనుదిరిగారని సమాచారం.

కోర్టు తీర్పు ఎలా ఉంటుందో..

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులోని పొరపాట్లు, అలాగే అవిశ్వాసం కోసం అధికారులు కౌన్సిలర్లకు జారీ చేసిన నోటీసుల్లో తప్పిదాల ఆధారంగా మాజీ చైర్‌పర్సన్ జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 15న విచారణ జరగనుంది. అదే రోజు చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అవిశ్వాస నోటీసు, అలాగే కలెక్టర్ జారీ చేసిన నోటీసుల్లోని తప్పిదాల విషయంలో కోర్టు ఏం చెబుతుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

సుపరిపాలన పేరుతో బీజేపీ..

అవినీతి రహిత పాలన పేరుతో బీజేపీ సైతం చైర్‌పర్సన్ పీఠం కోసం ప్రయత్నాలు చేస్తోంది. నిజాయితీపరులనే మున్సిపల్ పీఠంపై కూర్చోబెట్టాలని స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. ఏ పార్టీ వారైనా సరే నిజాయితీగా ఉండేవారిని ఎన్నుకోవాలని ఆయన ఇచ్చిన పిలుపుతో రాజకీయాల్లో చర్చ మొదలైంది. కాగా చైర్‌పర్సన్ పీఠంపై కన్నేసిన బీజేపీ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లోని అసంతృప్త కౌన్సిలర్ల మద్దతు కూడగట్టినట్లు తెలుస్తోంది.

అక్రమ వడ్డీ వ్యాపారులపై కొరడా



జిల్లా కేంద్రంలో ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

- జిల్లావ్యాప్తంగా 70 చోట్ల పోలీసుల దాడులు
- భారీగా నగదు, బంగారం, డాక్యుమెంట్ల స్వాధీనం
- 23 కేసులు నమోదు

కామారెడ్డి టౌన్: జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారంపె పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఎస్పీ సింధు శర్మ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా 70 చోట్ల దాడులు చేశారు. జిల్లాలో పలువురు వ్యాపారులు అమాయకుల అవసరాలను అవకాశంగా మలచుకుని వ్యాపారం చేస్తున్నారు. భూములు, ప్లాట్లు, బంగారం తనఖాగా పెట్టుకుని అడ్డగోలు వడ్డీకి అప్పులిస్తున్నారు. రూ. 2 నుంచి రూ. 5 వరకు వడ్డీ విధిస్తూ, చక్ర వడ్డీ లెక్కలు వేస్తూ అప్పు తీర్చలేని పరిస్థితిని కల్పించి చివరకు తనఖా పెట్టిన ఆస్తులను సొంతం చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అక్రమ వడ్డీ వ్యాపారులను కట్టడి చేసేందుకు పోలీసులు నడుం బిగించారు. జిల్లాలో వరుస దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో నివసించే ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు జరిగాయి. అక్రమ వడ్డీ వ్యాపారానికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు, నగదు, బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలు 70 చోట్ల పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 23 మంది అక్రమ వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ. 49.58 లక్షల నగదుతో పాటు 157 గ్రాముల బంగారం, 315 ప్రామిసరీ నోట్లు, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ చెక్కులు, పట్టా పాస్ బుక్కులు, సంతకాలతో కూడిన కాళీ ప్రామిసరీ నోట్స్, నోట్ బుక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారులు చేస్తున్న ఆర్థిక మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఎవరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



పిట్లంలో ఓ నగల దుకాణంలో పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

గడువు పొడిగింపును వినియోగించుకోండి



మాట్లాడుతున్న చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీమ్ గడువును జూన్ 30 వరకు పొడిగించినట్లు చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈమేరకు ఓటీఎస్ గడువును పొడిగించినట్లు పాలకవర్గం నిర్ణయం తీసుకుందని రమేశ్‌రెడ్డి వివరించారు. జూన్ 30 తర్వాత ఓటీఎస్ గడువు పొడిగించబోమని, కావున ఉమ్మడి జిల్లాలోని రైతాంగం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, గోర్కంటి లింగం, సీఈవో నాగభూషణం వందే, డీసీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ ఉమ్మడి జిల్లా సొసైటీ కార్యదర్శులు, చైర్మన్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ రమేశ్‌రెడ్డితో పాటు డైరెక్టర్లను సన్మానించారు. ఈసందర్భంగా సొసైటీ కార్యదర్శులకు రూ. 2లక్షల ఆరోగ్య బీమా, సంఘ సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం చైర్మన్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ కార్యదర్శులకు ఆరోగ్య బీమా కల్పిస్తామని, సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు వందశాతం వసూలయ్యాయని పేర్కొన్నారు. అలాగే ఆర్థికంగా వెనుకబడిన సంఘ సిబ్బందికి జీతభత్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి వందశాతం రీయింబర్స్‌మెంట్ కల్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని సొసైటీ కార్యదర్శులు, బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

బంగారం ధర ధగధగ!

పది గ్రాముల వెల రూ.75,600..

- రోజురోజుకు కొత్త రికార్డులు సృష్టిస్తున్న పుత్తడి
- నెల రోజుల్లో రూ.10 వేలకుపైగా పెరుగుదల





స్వర్ణకారుల దుకాణాల్లో కనిపిస్తున్న బోర్డులు

సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు ఆకాశాన్నంటున్నాయి. రోజురోజుకు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. శుక్రవారం కామారెడ్డి మార్కెట్‌లో పది గ్రాముల బంగారం(24 క్యారెట్లు) రూ. 75,600లు పలికింది. నెల రోజుల వ్యవధిలోనే రూ. 10 వేల ధర పెరగడం సామాన్యులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నెలాఖరు దాకా శుభ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లు, ఫంక్షన్ల కోసం బంగారం కొనుగోలు చేయడానికి వెళ్లిన వారు పెరిగిన ధరలను చూసి హడలిపోతున్నారు. బంగారం క్రయవిక్రయాలకు కామారెడ్డి మార్కెట్ చుట్టుపక్కల జిల్లాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. ఇక్కడ భారీ ఎత్తున విక్రయాలు జరుగుతుంటాయి. చుట్టుపక్కల మూడు, నాలుగు జిల్లాలకు చెందిన వారు కామారెడ్డికి వచ్చి బంగారం కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలో నలభైకి పైగా బంగారం దుకాణాలున్నాయి. బంగారం ఆభరణాల తయారీపై ఆధారపడి మూడు వందలకు పైగా స్వర్ణకారులు జీవిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్యులే కాదు.. వ్యాపారులు, స్వర్ణకారులూ ఇబ్బందిపడుతున్నారు. పెళ్లి కానుకగా బంగారం ఇవ్వడానికి ఒప్పుకున్నవారు పెరిగిన ధరతో ఇబ్బందిపడుతున్నారు. నెలలో రూ. 10 వేలు పెరగడంతో ఇరవై తులాల బంగారం పెట్టాలంటే దాదాపు రూ.2 లక్షలు అదనంగా భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మే, జూన్, జూలైలలో శుభ ముహూర్తాలు లేవు. దాదాపు మూడు నెలల పాటు బంగారం అమ్మకాలు, ఆభరణాల తయారీ అంతంత మాత్రంగానే ఉండనుంది. ఏప్రిల్ మాసంలో కొన్ని ముహూర్తాలున్నాయి. ధరల ప్రభావం కొనుగోళ్లపై పడుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ధర అడ్డగోలుగా పెరుగుతుండడంతో వ్యాపారులు అమ్మకాల విషయంలో ఆచితూచి అడుగేస్తున్నారు.

వెండి ధరలకూ రెక్కలు..

ఇటీవలికాలంలో వెండి ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. పది రోజుల క్రితం పది గ్రా ముల వెండి ధర రూ.770 ఉండగా.. శుక్రవా రం నాటికి రూ. 880కి చేరింది. శుభకార్యాల సీజన్‌లో ధరలు పెరగడంతో వెండి వస్తువులు కొనడానికి కూడా జనం సాహసించడం లేదు. ధరలు ఇలాగే పెరిగితే సామాన్యులు వెండి, బంగారం కొనడం కలగానే మిగులుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆభరణాల తయారీదారుల్లో ఆందోళన

బంగారం ధరలు అడ్డగోలుగా పెరుగుతుండడంతో ఆభరణాలు తయారు చేసే స్వర్ణకారులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో పనులు తగ్గుతాయనే బాధ ఒక వైపు ఉండగా.. ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న వాటికి బంగారం కొనుగోలు చేయడం సమస్యగా మారనుంది. ఆభరణాల తయారీ కోసం డబ్బులు ఇచ్చిన వాళ్లు అప్పటి ధరలే ఇస్తామని చెబుతుండడంతో, బంగారం కొనుగోలు చేయడానికి చేతి నుంచి డబ్బులు భరించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణకార వృత్తిలో పెరిగిన పోటీ మూలంగా గిరాకీ దెబ్బతినకుండా చూసుకోవాలన్న ఉద్దేశంతో నష్టాన్ని కూడా భరించేవాళ్లు కొందరైతే, నష్టపోయి బతకడం భారమని మరికొందరు గిరాకీని వదులుకుంటున్నారు.

ఇంకొందరు ధరల పెరుగుదల నేపథ్యంలో ఆభరణాలు చేయించుకునేవారు తమకు సహకరించాలంటూ దుకాణాల్లో పోస్టర్లు అతికించుకుంటున్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు

లింగంపేట: మండలకేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఉగాదిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన కుస్తీపోటీలు ఉత్కంఠగా సాగాయి. మండలంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి మల్లయోధులు వచ్చారు. ఫైనల్‌లో గెలిచిన వారికి వెండి కడియాలు బహూకరించారు.



కోనాపూర్‌లో..



లింగంపేటలో తలపడుతున్న మల్లయోధులు

క్లుప్తంగా

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం



కామారెడ్డి టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ రజనీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక కర్షక్ బీఈడీ కళాశాలల జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 7వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్స్ నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్, నాయకులు మణికంఠ, సాయి, సాగర్, నితిన్, సచిన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



నిజామాబాద్ నాగారం: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు లకావత్ రాణి, గుగ్లోత్ మమత, గుండా వినయ్ ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు శనివారం నుంచి తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

మే 5న కబడ్డీ జిల్లా కమిటీ ఎన్నికలు



నిజామాబాద్‌నాగారం: కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు మే 5న నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి అంద్యాల లింగన్న తెలిపారు. నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో శుక్రవారం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్వొకేట్ బొబ్బిలి చిన్నారెడ్డిని ఎన్నికల అధికారిగా నియమించాలని తీర్మానం చేశామన్నారు. నాలుగేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను కోశాధికారి సమర్పించగా సభ్యులందరూ ఆమోదించారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి శివారులోని గోస్కె రాజయ్య కాలనీలో పేకాట స్థావరంపై దేవునిపల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11,840 నగదు, మూడు ఫోన్లు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడపొద్దు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మద్యం సేవించి వాహనం నడప రాదని ఏఎస్సై రాములు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని బేగంపూర్ గ్రామ చౌరస్తాలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఈసీ నజర్!

- పార్టీలకు అనుకూలంగా ఉంటే చర్యలు
- జిల్లాలో అధికారులు అప్రమత్తం



ఖలీల్‌వాడి: లోకసభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై పోలీసులు, సర్వేలైన్స్ బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఇటీవల సిద్దిపేటలో ఓ పార్టీ సమావేశానికి వెళ్లిన 106 మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల వేళ ఒకేసారి 106 మందిని సస్పెండ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్వేలైన్స్ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. జిల్లాలోనూ అధికారులపై నిఘా పెట్టారు. ఇటీవల ఓ పార్టీకి అనుకూలంగా సోషల్ మీడియలో పోస్ట్ పెట్టిన వేల్పూర్ ట్రాన్స్‌కో ఏఈ యశ్వంత్‌రావును ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు సస్పెండ్ చేశారు.

గతంలోనూ ఘటనలు

ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో జిల్లాలోని కొందరు అధికారులు, పోలీసులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు బదిలీలు జరిగాయి. జిల్లాకు చెందిన పోలీస్ కమిషనర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, కొంత మంది రెవెన్యూ అధికారులను బదిలీ చేశారు. ఎన్నికలలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై బదిలీ చేపట్టారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓ పార్టీకి మద్దతు తెలిపిన అధికారులపై బదిలీ వేటు పడింది.

జాగ్రత్తగా ఉండాల్సిందే

ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు మద్దతు ప్రకటించవద్దని, ప్రచారం చేయవద్దని ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. ఈ నిబంధన 1949 సెప్టెంబర్ 17 నుంచి ఎన్నికల సంఘం అమలులోకి తీసుకువచ్చింది. అధికారులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సెక్షన్ 23(ఐ) ప్రకారం ఎన్నికల నిబంధనల కిందికి వస్తారు. ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రతి ఉద్యోగి తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అందించిన ఎన్నికల బాధ్యతతో పనులు చేయాల్సి ఉంటుంది.

సెర్ప్, ఉపాధి హామీ సిబ్బందిపై దృష్టి

సిద్దిపేటలో ఓ పార్టీ సమావేశానికి వెళ్లిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులలో ఎక్కువ మంది సెర్ప్, ఎంఎన్ఆర్‌జీఎస్ ఉద్యోగులు ఉండటంతో ఈ శాఖలపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సెర్ప్‌లో ఎక్కువ మహిళా సంఘాలు ఉండటంతోపాటు ఉపాధి హామీ పథకంలో కూలీలు ఉండటంతో అధికారులు ప్రభావితం చేస్తారనే ప్రచారం ఉంది. సిద్దిపేట ఘటనతో జిల్లాలోని ఎన్నికల అధికారులు ఈ రెండు శాఖలపై దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రెండు శాఖల్లో కొంత మంది అధికారులు ఏళ్ల నుంచి ఒకే చోట తిష్ట వేశారనే ప్రచారం కూడా ఉంది.

ఇదీ తప్పే..

- అధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఓ పార్టీకి ఓటు వేయాలని చెప్పకూడదు.
- అధికారులు ప్రత్యక్షంగాని, పరోక్షంగాని ఒక అభ్యర్థికి సహకరిస్తారని చిన్నపాటి ఆధారం ఉన్న సస్పెండ్ చేస్తారు.
- సోషల్ మీడియాలో ఓ పార్టీకి అనుకూలంగా పోస్టు చేసిన చర్యలు తీసుకుంటారు.
- ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నా, కుల సమీకరణల నేపథ్యంలో ప్రచారం చేసిన వేటు తప్పదు.
- రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన చర్యలు తప్పవు.

ఇందూర్‌ను స్మార్ట్‌సిటీ చేస్తా



చాయ్ పే చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

- కాంగ్రెస్ పార్టీ మతతత్వ రాజకీయాలు చేస్తోంది
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే నిజామాబాద్‌ను స్మార్ట్‌సిటీ చేస్తానని ఎంపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఐటీఐ కళాశాల వద్ద సాయిరాం హోటల్‌లో చాయ్ పే చర్చా, మనందరిది మోదీ కుటుంబం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశంలో బీజేపీ మరోసారి ఎందుకు అధికారం ఏర్పాటు చేయాలనే అంశాలను పలువురు వివరించి, తమ అభిప్రాయాలను తెలియజేశారు. అంతకుముందు ఐటీఐ కళాశాల మైదానంలో వాకర్స్‌తో ముచ్చటించారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, రూ.5లక్షలు నిధులు కేటాయించాలని కోరగా, ఎన్నికలు ముగిసిన వెంటనే మంజూరు చేస్తానని ఎంపీ అర్వింద్ హామీనిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ఏనాడూ హిందువుల కోసమే పథకాలు ప్రారంభించలేదని, అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమల్జేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మైనార్టీల కోసం వాగ్దానాలిచ్చిందని ఉదహరించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే మతతత్వ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశ్, మయన్మార్ ముస్లింలకు జీవన్‌రెడ్డి పౌరసత్వం ఇవ్వాలనడం సరికాదన్నారు. అలా అయితే దేశాన్ని ఎందుకు విభజించారని, కాంగ్రెస్‌కు ఓటేస్తే మరోసారి దేశ విభజన ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఎన్ఆర్‌సీ, సీఏఏ అమలవుతాయని చెప్పారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్‌కు దేశంలో స్థానం లేకుండా చేయాలన్నారు. మోదీ, పసుపు రైతుల ఆశీర్వాదం, శ్రీరాముని ఆశీస్సులు, ప్రజలందరి దీవెనలతో మరోసారి తాను గెలవడం ఖాయమన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, బుస్సాపూర్ శంకర్, రాఘవేందర్, సుక్క మధు, ప్రభాకర్, బంటు రామ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

రుద్రూర్: వడగళ్ల వానతో పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 25వేలు నష్ట పరిహారం అందించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. పోతంగల్ మండలం సోంపూర్, టాక్లీ, కోటగిరి మండలం యాద్‌గార్‌పూర్ గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం పరిశీలించారు. రైతుల బాధను చూస్తుంటే తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. వడగళ్ల వానతో జరిగిన పంట నష్టం వివరాలను సమగ్రంగా సేకరించి ప్రభుత్వానికి పంపించాల్సిందిగా అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ శంకర్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, పోతంగల్ విండో చైర్మన్ శాంతీశ్వర్ పటేల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సీరడి గంగాధర్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, గంట్ల విఠల్, సీహెచ్ గంగాధర్, కొడిచర్ల మల్లేశ్, అర్జున్, సాయిలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సోంపూర్‌లో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జలాల్‌పూర్‌లో..

వర్ని: అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ని మండలంలోని జలాల్‌పూర్‌లో, చందూర్ మండలం కారేగాం, మేడిపల్లి, లక్ష్మీసాగర్ తండా గ్రామాల్లో అకాల వర్షానికి నష్టపోయిన పంటలను శుక్రవారం పరిశీలించారు. ఎకరానికి రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ వర్ని మండల అధ్యక్షుడు గిరి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గోపాల్, జాకోరా సింగిల్ విండో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీనగర్ మాజీ సర్పంచ్ రాజు, సీహెచ్ గంగాధర్, చందురు సహకార సంఘం అధ్యక్షుడు ప్యారం అశోక్, సర్పంచులు సత్యనారాయణ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారాలపై దాడులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై శుక్రవారం దాడులు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటేశం, రాజేశం ఇళ్లు, ఫైనాన్స్ కార్యాలయాలపై దాడులు చేయగా ప్రామిసరీ నోట్లు లభించాయని పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పిట్లం: పిట్లంలో ఎస్సై నీరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు వడ్డీ వ్యాపారులపై, ఫైనాన్స్‌లపై దాడులు నిర్వహించారు. రిజిస్టర్‌లను, ఖాతాబుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బాన్సువాడ: బాన్సువాడ, బీర్కూర్‌లో శుక్రవారం వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు డబ్బులు ఇస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని సీఐ కృష్ణ తెలిపారు. బాన్సువాడలో చీదుర రాజేందర్, పాలకుర్తి విఠల్, దేవేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన అన్నారు. బీర్కూర్‌లో మహాజన్ గోపి ఇంట్లో సోదాలు చేయగా 21 ప్రామిసరీ నోట్లు, 8 చెక్కులు లభించడంతో కేసు నమోదు చేశామని బీర్కూర్ ఎస్సై తెలిపారు.





భిక్కనూరులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, సదాశివనగర్‌లో..

సదాశివనగర్: సదాశివనగర్‌కు చెందిన ఆనంపల్లి ప్రభాకర్ అనే వ్యాపారి లైసెన్స్ లేకుండా రుణాలు ఇస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ కాజల్ పేర్కొన్నారు. ఇంట్లో తనిఖీలు చేసి నగదు, బంగారం, ప్రామిసరీ నోట్స్, పట్టాదారు పాస్ పుస్తకాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఎస్సై రాజు పాల్గొన్నారు.

బిచ్కుంద: బిచ్కుందలో వడ్డీ వ్యాపారం చేస్తున్న వారి ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన ఎస్ బాల్‌రాజు, కాపర్తి విఠల్ రూ.ఐదు లక్షలు వడ్డీ ఇచ్చినట్లు గుర్తించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు.



పిట్లంలో ..

కల్తీ కల్లు దందా



కల్లు సీసాలు

- మత్తులో యువత చిత్తు
- అలవాటైతే మానలేని పరిస్థితి

నిజామాబాద్ రూరల్: ఇటీవల కాలుర్ గ్రామానికి చెందిని ఓ వ్యక్తి కొండగట్టు, ధర్మపురికి దైవ దర్శనానికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. ఆయనకు గుల్ఫారం కల్లు అలవాటు ఉంది. రెండు రోజులు కల్లు లేకపోవడంతో ధర్మపురిలో దర్శనానికి లైన్ నిల్చున్న ఆయన ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఇలా ఎంతో మంది కల్తీ కల్లుకు అలవాటైన అది లేకపోతే ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు కష్టపడి పనిచేసి నిద్రకోసం సాయంత్రం గ్రామాల్లో ఎంతోమంది కల్తీ కల్లు తాగుతారు. ఇదే వారికి యమపాశంగా మారుతోంది. ఒకసారి అలవాటైన కల్లు మానడం సాధ్యం కావడం లేదు. కల్లు లేకపోతే వారు విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. నిషేధిత డైజోఫాం, క్లోరోహైడ్రేట్, అల్ప్రాజోలంలకు ఈస్ట్‌ను కలిపి కల్తీ కల్లును తయారు చేస్తారు.

గల్ఫ్‌లో ఇక్కట్లు

కల్తీ కల్లు సీసా రూ.10నుంచి రూ. 15 వరకు విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే మత్తు, నిద్ర వస్తుందని యువకులు దీనికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన యువకుల్లో కల్లు అలవాటు ఉన్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ కల్లు దొరక్క మతిస్థిమితం కొల్పోయి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. కల్తీ కల్లుపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

50 మందిని ఇంటికి పంపాం..



కల్తీ కల్లు అలవాటు ఉన్న వారిని గల్ఫ్ దేశాలకు పంపొద్దు. కల్లు దొరక్క ఇబ్బంది పడ్డ 50 మందిని ఇప్పటి వరకు మా సంఘం ఆధ్వర్యంలో స్వగ్రామాలకు పంపించాం. గల్ఫ్ వచ్చే కొన్ని రోజుల ముందు నుంచే కల్లు మానేయడం అలవాటు చేసుకోవాలి.

– పెద్ది రవికుమార్, కుర్మ యువ చైతన్య సమితి దుబాయి శాఖ అధ్యక్షుడు

గుత్ప విస్తరణ పూర్తయ్యేదెన్నడు..!

- నత్తనడకన సాగుతున్న పనులు
- ఎనిమిదేళ్లయినా పూర్తికాని వైనం
- అందుబాటులోకి వస్తే 13 గ్రామాలకు సాగునీరు

ఆర్మూర్: అర్గుల్ రాజారాం(గుత్ప) ఎత్తిపోతల పథకం విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ఈ ప్రాంత రైతాంగం ఎదురు చూస్తోంది. మొదటి విడత పనులు ప్రారంభించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నిధుల కేటాయింపు లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు రూ. 24 కోట్ల వ్యయంతో తలపెట్టిన పనులకు.. గత ప్రభుత్వం మొదటి విడతకు గాను రూ. 11.90కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని ఆర్మూర్, మాక్లూర్, జక్రాన్‌పల్లి మండలాల్లోని 13 గ్రామాలకు గుత్ప నీటిని అందించడానికి 2016లో అప్పటి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు కేవలం 60 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. గుత్ప చెరువు వద్ద కాలువ తవ్వకం పనులు, జక్రాన్‌పల్లి, అర్గుల్ శివార్లలో పైప్‌లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు పూర్తయితే సుమారు 20వేల ఎకరాల ఆయకట్టు అదనంగా స్థిరీకరణ జరిగే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఈ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల ఎత్తిపోతలను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించి పనులను పూర్తి చేస్తామని తెలిపారు.



నందిపేట మండలంలో నిర్మించిన గుత్ప ఎత్తిపోతల పథకం

మాక్లూర్‌లోనే 13వేల ఎకరాలు

గుత్ప ఎత్తిపోతల విస్తరణతో మాక్లూర్ మండలంలోని గ్రామాల పరిధిలో ఉన్న సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంది. మాక్లూర్, ముల్లంగి(బీ), బొంకన్‌పల్లి, మాదాపూర్, బోర్గాం(కే), మాణిక్ బండార్, అమ్రాద్, ముత్యంపల్లి, వడ్యాట్‌పల్లి, మదన్‌పల్లి, దాస్‌నగర్, మామిడిపల్లి, చిన్నాపూర్, గుత్ప తదితర గ్రామాలు గుత్ప ఎత్తిపోతల పథకం పరిధిలోకి వస్తాయి.

జక్రాన్‌పల్లిలో ఆరు వేల ఎకరాలకు..

జక్రాన్‌పల్లి మండలంలోని లక్ష్మాపూర్, నారాయణ్‌పేట్, అర్గుల్, జక్రాన్‌పల్లి, పడకల్, మునిపల్లి, కేశపల్లి గ్రామాల్లో ఎనిమిది పెద్ద చెరువులు, 24 కుంటలు ఉన్నాయి. గుత్ప ఎత్తిపోతల నీరు ఈ చెరువులు, కుంటలను నింపితే భూగర్భ జలాలు సైతం అభివద్ధి చెంది ప్రత్యక్షంగా ఆరు వేల ఎకరాలకు, పరోక్షంగా వందల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఏర్పడుతుంది.

బిల్లులు మంజూరు కాలేదు

గుత్ప ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు కాని కారణంగా పనులను మధ్యలో ఆపేశారు. ఇంకా 40 శాతం పనులు పూర్తవ్వాల్సి ఉంది.

– ప్రవీణ్, ఏఈ, ఎత్తిపోతల పథకం పర్యవేక్షణాధికారి

క్రైం కార్నర్

బావిలో పడి రైతు మృతి



రవి (ఫైల్)

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో శివోళ్ల రవి (55) ప్రమాదవశాత్తు తన పొలం వద్దగల బావిలో జారి పడి మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలు.. పొలంలో పనుల కోసం రోజూవారీలాగే రవితోపాటు ఆయన భార్య మంజుల వెళ్లింది. పని చేస్తున్న క్రమంలో రవి అక్కడి నుంచి వెళ్లాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో భార్య, చుట్టుపక్కల రైతులతో కలిసి వెతికింది. కొద్దిసేపటికి రవి మృతదేహం బావిలో తేలింది. ప్రమాదవశాత్తు బావిలో జారి పడి మృతిచెంది ఉంటాడని గ్రామస్తులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పూసవెర్ల శేఖర్ (32) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. శేఖర్ ఈ నెల 11న కుమ్మరి కుంట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి వల తట్టుకుని నీట మునిగి మృతి చెందాడు. శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో ముగ్గురికి గాయాలు

భిక్కనూరు: మండలంలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. శుక్రవారం భిక్కనూరులో ముగ్గురిపై కోతులు దాడి చేశాయి. కానిస్టేబుల్ నరేశ్ సైతం వానరాల దాడిలో గాయపడ్డారు. బాధితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఉన్నతాధికారుల స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పోక్సో కేసు నమోదు

ఎడపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను పెళ్లి పేరిట వేధించిన నిజామాబాద్ నగరం గాజులపేటకు చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్/కమ్మర్‌పల్లి/బాల్కొండ: ఆర్మూర్ డివిజన్‌లోని పది పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 19 మందికి ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. 237మందికి రూ.4,43000 జరిమానా విధించారు ఇందులో కమ్మర్‌పల్లి ఠాణాకు పరిధిలో నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజుల జైలు, మరొకరికి రూ.ఆరు వేల జరిమానా విధించారని ఎస్సై భాస్కరచారీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేట శివారులోని లొట్టివాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు చేస్తామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలు స్వాధీనం

బాన్సువాడ/బిచ్కుంద: బాన్సువాడ డివిజన్ పరిధిలో శుక్రవారం కల్లు డిపోల్లో తనిఖీలు చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బిచ్కుంద మండలం పెద్ద దేవాడ గ్రామానికి చెందిన ముత్యాలవార్ గంగాగౌడ్ అలియాస్ సతీష్‌గౌడ్ కల్లు కంపౌండ్‌లో తనిఖీ చేసి 240 గ్రాముల అల్ప్రాజోలం, మిక్స్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పిట్లం మండలం బోలక్‌పల్లి గ్రామానికి చెందిన బైరి హన్మగౌడ్‌కు కల్లు డిపోలో 10 గ్రాముల అల్ప్రాజోలం, 33 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హన్మాగౌడ్‌ను విచారించగా మెదక్ జిల్లా మంబోజిపల్లి గ్రామానికి చెందిన గౌండ్ల శివకుమార్ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పాడు. దీంతో మంబోజిపల్లికి వెళ్లి శివకుమార్ ఇంట్లో 23 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు. అల్ప్రాజోలం మిక్స్ పౌడర్, గంజాయి ద్వారా ప్రజల ప్రాణాలకు హాని కలుగజేస్తున్న ముత్యాలవార్ గంగాగౌడ్, బైరీ హన్మాగౌడ్, శివకుమార్‌ను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. వారి నుంచి ఒక బైక్, మూడు సెల్‌ఫోన్లు, వెయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ సత్యనారాయణ గౌడ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు తిరుపయ్య, బిచ్కుంద, పిట్లం ఎస్సైలను ఎస్పీ అభినందించినట్లు ఆయన తెలిపారు.



అల్ప్రాజోలం మిక్స్ పౌడర్ పట్టుకున్న పోలీసులు

బాధితుడిని బెదిరించిన సీఐపై విచారణ

ఖలీల్‌వాడి: చోరీ కేసులో ఫిర్యాదుదారుడిని విచారణ నిమిత్తం పిలిపించి మద్యం మత్తులో బెదిరించిన సీఐపై ఏసీపీ విచారణ చేపట్టినట్లు ఆలస్యంగా తెలిసింది. సీసీఎస్‌లో పని చేస్తున్న సదరు సీఐ రెండు రోజుల క్రితం దొంగతనం కేసులో బాధితుడిని బెదిరించాడు. దీంతో ఆయన నాలుగో టౌన్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో సీఐతో పాటు బాధితుడితో మాట్లాడి పంపించినట్లు తెలిసింది. అనంతరం విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ జరుపుతున్నారు. సదరు సీఐ ఠాణాలోనే మద్యం తాగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ చేపడుతున్నారు.

మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి

మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు సిద్ధం సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మోసాల చంద్రబాబు నుంచి మన రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో మీరంతా ప్రతి ఇంటికి వెళ్లి గత 58 నెలలుగా జరిగిన మంచిని వివరించాలి. ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవాలు వివరించి స్టార్ క్యాంపైనర్లుగా చేయాలి. ఈ మంచి కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ రావాలి.. మోసపోకూడదంటే మీ బిడ్డకే ఓటు పడాలి అని ప్రతి గడపకూ చెప్పాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గుంటూరు శివారు ఏటుకూరు వద్ద నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



సభలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ..

ఈరోజు గుంటూరులో కనిపిస్తున్న ఈ మహా జన సముద్రం చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతుంది. మనందరి ప్రభుత్వానికి మద్దతుగా ఇప్పుడు జరుగుతున్న మంచిని కాపాడుకునేందుకు, ఆ మంచిని కొనసాగించేందుకు ఇక్కడి కి వచ్చిన ప్రతి అవ్వాతాత, సోదరులు, స్నేహితులకు చేతు లు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి గ్రామానికి పౌర సేవలు, విద్య, వైద్యం, రైతన్నలకు భరోసా, అక్క చెల్లెమ్మ లకు సాధికారత, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సేవలు అందించిన మన ప్రభుత్వానికి మద్దతు పలకడానికి మీరంతా సిద్ధమేనా? గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను ఒక్క రూపాయి కూడా లంచం, వివక్షకు తావు లేకుండా 130 సార్లు బటన్ నొక్కి పారదర్శకంగా నేరుగా అందించిన ఈ ప్రభుత్వానికి, మీ జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కేందుకు, మరో వంద మందికి చెప్పి నొక్కించడానికి మీరంతా సిద్ధమేనా?

రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు..

ఈ ఎన్నికల యుద్ధం కేవలం చంద్రబాబుకు, జగన్‌కు మధ్య జరుగుతున్నది కాదు. ఈ యుద్ధం చంద్రబాబు మోసాలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి, వాటిని ఆపిన బాబు దుర్మార్గాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది వారి మోసాలకు, మన విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఆ అబద్ధాల బాబుకు ఇద్దరు వంత పాడుతున్నారు. ఒకరు దత్తపుత్రుడు, మరొకరు ఆయన వదినమ్మ. ఈ ముగ్గురు కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు. 2014 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ నమ్మబలుకుతున్నారు.

మంచి కొనసాగాలో వద్దో ఆలోచించండి..

ఈ రోజు మీరంతా ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులతో కలసి ఒక్క అంశంపై ఆలోచన చేయమని కోరుతున్నా. మీ బిడ్డకు ఓటు వేయడం అంటే గత 58 నెలలుగా జరుగుతున్న మంచిని మీరందరూ కొనసాగించేందుకే ఓటు వేసినట్లే. మీ బిడ్డకు కాకుండా చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. ఈ 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని మీ అంతట మీరే మీకు వద్దని చెప్పినట్లేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నా. 58 నెలల క్రితం మీ బిడ్డ మీ అందరి ముందు నిలబడి ఫలానాది చేస్తానని ఎన్నికల మేనిఫెస్టో తీసుకొచ్చాడు. మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్ మాదిరిగా భావించి 99 శాతం హామీలను అమలు చేసి మీ ముందుకు వచ్చి మరోసారి ఆశీస్సులు కోరుతున్నాడు.

2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే..

ఒక్కసారి 2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. నాడు కూడా ఇదే కూటమి! మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలతో ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఇదే చంద్రబాబు సంతకం చేసి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో పాంప్లెట్లు ముద్రించి ప్రతి ఇంటికి పంపారు. మీరు మర్చిపోతారేమోననే భయంతో టీవీలలో, పేపర్లలో ఊదరగొట్టారు. చంద్రబాబు నాటి మోసాల్లో ఒక్కసారి ముఖ్యమైన వాటిని మీకు గుర్తు చేస్తా.

- రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా? ➤ పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా? ➤ ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మీకుగానీ, మీ ఇంటి చుట్టుపక్కల వారికిగానీ ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా? ➤ ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులైన వారందరికి మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి జరిగిందా?
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. మరి జరిగిందా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి గుంటూరులో ఏమైనా కనిపిస్తోందా?

సెల్‌ఫోన్ లైట్లతో సంఘీభావం..

వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్ బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన ఆస్పత్రులు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి. 175కి 175 అసెంబ్లీ సీట్లు, 25కి 25 పార్లమెంట్ సీట్లలో ఏ ఒక్కటీ తగ్గకుండా గెలిపించేందుకు మీరు సిద్ధమేనా? పేదల భవిష్యత్తు బాగుండాలని చేస్తున్న ఈ యుద్ధానికి మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయాలి.

పాలకుడు మోసగాడైతే...

ఎలాంటి వారు రాజకీయ నాయకుడిగా ఉండాలి? ఎలాంటి వారిని మనం ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలన్న విషయంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. ఎందుకంటే మనం వేసే ఓటు ద్వారా రాబోయే ఐదేళ్ల జీవితం ఆ పాలకుడి చేతుల్లో పెడుతున్నాం. ఆ పాలకుడికి మంచి మనసు ఉండి మంచి చేస్తే మన జీవితాలు బాగుపడతాయి. ఆ పాలకుడు మోసగాడు అయితే మన బతుకులు అంధకారం అవుతాయి. పిల్లల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. అక్కచెల్లెమ్మల బతుకులు అతలాకుతలం అవుతాయి. రైతన్నల జీవితాలు మోసపోయి ఆత్మహత్యల పాలవుతాయి. అవ్వాతాతల సంక్షేమం అడుగంటిపోతుంది. అందుకే ఈ వాస్తవాలపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలని కోరుతున్నా. గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిలారు రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థులు నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, మురుగుడు లావణ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, విడదల రజని, అంబటి మురళీకృష్ణ, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మందపాటి శేషగిరిరావు, బత్తుల దేవానంద్ తదితరులు ఏటుకూరు సిద్ధం సభలో పాల్గొన్నారు.

తెలంగాణకు 8.5 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

గత అక్టోబర్‌లో చివరి సారిగా సమావేశమైంది. శ్రీశైలం ప్రాజెక్టు కనీస మట్టం (ఎండీడీఎల్)ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి రెండు జలాశయాల్లో 92.78 టీఎంసీలు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించింది. అయినప్పటికీ మే మాసాంతం వరకు మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలనే వినియోగించాలని అప్పట్లో కమిటీ నిర్ణయించింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాల కోసమని రిజర్వ్ చేసింది. మిగిలిన 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించిన విషయం విదితమే. కాగా కమిటీ నిర్ణయించిన కోటాకు మించి తెలంగాణ ఇప్పటికే 11 టీఎంసీలను వినియోగించుకుంది. ఏపీ కోటా మేరకు వినియోగించుకుంది. అయితే ఇరు రాష్ట్రాలు తాగునీటి అవసరాలకు అదనంగా జలాలను విడుదల చేయాలని బోర్డుకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలోనే కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంది. సమావేశంలో సాగర్ సీఈ అజయ్‌కుమార్, ఈఈ విజయ్‌భాస్కర్, కృష్ణా బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మంచినీటి కొరత ఎక్కువగా ఉంది: ఈఎన్సీ

త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం తాగునీటి అంశంపైనే చర్చించామని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి సమావేశానంతరం చెప్పారు. 2 రాష్ట్రాల అంగీకారంతో నీటి వాటాల పంపిణీ జరిగిందని తెలిపారు. ఏపీలో మంచినీటి కొరత కొంత ఎక్కువగా ఉందని వివరించారు.

'ఇంటర్' ద డ్రాగన్..

▶ మొదటి పేజీ తరువాయి

యాజమాన్యాలు చెప్తున్నాయి. కోవిడ్ సమయంలో కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారని, కొరత కారణంగా ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నాయి. నిర్వహణ భారం పెరిగిందని చెప్పుకొస్తున్నాయి.



అఫిలియేషన్ ఫీజు పెంచకున్నా..

రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు మూడు కేటగిరీల కింద అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇస్తుంది. ప్రతీ విద్యాసంస్థలో గరిష్టంగా 960 మందిని చేర్చుకునేందుకు అనుమతిస్తారు. అఫిలియేషన్ ఫీజు కింద ఏటా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలేజీల నుంచి రూ.1.20 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలోని కాలేజీల నుంచి రూ.60 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తారు. రెండేళ్లకోసారి ఈ ఫీజులను సమీక్షించి పెంచాల్సి ఉన్నా.. ఇంటర్ బోర్డు కొన్నేళ్లుగా పెంచలేదు.

50 శాతం దాకా పెంపు..

సాధారణ జూనియర్ కాలేజీల్లో గత ఏడాది వరకూ గరిష్టంగా రూ.60 వేల ఫీజు ఉంటే.. ఈసారి రూ.90 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. కార్పొరేట్ కాలేజీలు రూ.1.25 లక్షల నుంచి రూ. 2 లక్షలకుపైగా (కాలేజీని బట్టి) డిమాండ్ చేస్తున్నాయని.. అదే హాస్టల్‌నూ కలిపితే ఏకంగా రూ.3.25 లక్షల వరకు చెప్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఫీజులు పెంచడాన్ని చూసి.. సాధారణ కాలేజీలు కూ డా పెంచుతున్నాయని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల పరిధిలోనూ వార్షిక ఫీజులను రూ.75 వేల కు తక్కువ వసూలు చేయడం లేదని అంటున్నారు. మరో వైపు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కుల ధరలు కూడా గత ఏడా దితో పోల్చితే 20శాతం మేర పెరిగాయని.. ప్రైవేటు కాలేజీల రవాణా, ఆటో చార్జీలు కూడా 30శాతం వరకూ పెంచారని తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో ఇంటర్మీడియట్ విద్య కోసమే రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఇంటర్ ఫీజుల తీరు ఇలా.. (రూ.లలో)

కాలేజీల తరహా	గత ఏడాది	ఈ సంవత్సరం
కార్పొరేట్ కాలేజీలు (డే స్కాలర్)	1.25 లక్షలు	2.25 లక్షలు
కార్పొరేట్ కాలేజీలు (విత్ హాస్టల్)	2.25 లక్షలు	3 నుంచి 3.25 లక్షలు
హైదరాబాద్‌లోని సాధారణ కాలేజీలు	75 వేలు	1.25 నుంచి 1.50 లక్షలు
సాధారణ కాలేజీలు (విత్ హాస్టల్)	1.25 లక్షలు	1.50 నుంచి 1.75 లక్షలు
మున్సిపాలిటీల్లో కాలేజీలు	60 వేలు	90 వేలు
మున్సిపాలిటీల్లో (విత్ హాస్టల్)	90 వేలు	1.25 లక్షలు
గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలు	40 వేలు	60 నుంచి 70 వేలు

అంత ఫీజు ఎలా కట్టగలం?

ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన మా అబ్బాయిని చేర్పించాలంటూ ఓ ప్రైవేటు కాలేజీ సిబ్బంది వెంటపడ్డారు. అడ్మిషన్ కోసం వెళ్తే ఏటా రూ.2.25 లక్షల ఫీజు అని చెప్పారు. కావాలంటే ఓ రూ.25 వేలు రాయితీ ఇస్తామన్నారు. అంత ఫీజేమిటని అడిగితే ఈ ఏడాది ఖర్చులు పెరిగాయని, అందుకే ఫీజులు పెంచామని చెప్పారు. రెండేళ్లకు రూ.4 లక్షల ఫీజు ఎలా కట్టగలం. వేరే కాలేజీల్లో ఆరా తీసినా అడ్డగోలుగా పెంచారు. ప్రభుత్వం నియంత్రణ చేపడితే పేదలకు ఊరటగా ఉంటుంది.
– సుచిత్ర, ఇంటర్ విద్యార్థి తల్లి, హైదరాబాద్

ఫీజుల నియంత్రణ అవసరం

కొన్ని కార్పొరేట్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు పెంచడం వల్ల అన్ని కాలేజీలూ ఆ నింద మోయాల్సి వస్తోంది. ప్రభుత్వమే కాలేజీలను కేటగిరీలుగా విభజించి, ఫీజుల నిర్ణయం చేయాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. పేదలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడానికి ఫీజుల కట్టడి చట్టాలు అవసరం.
– గౌరీ సతీశ్, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

కార్పొరేట్ ఆగడాలను అడ్డుకోరా?

అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తవకుండానే ప్రైవేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టడం చట్ట విరుద్ధం. దీనికితోడు పేదలు ఏమాత్రం భరించలేని విధంగా ఫీజులు పెంచడం దుర్మార్గం. పాలక వర్గాలు దీన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నాయి. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి.. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజు దోపిడీని అడ్డుకోవాలి.
– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

దోపిడీని నియంత్రించకుంటే ఆందోళన

ప్రైవేటు కాలేజీల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సర్కారు నుంచి ఏ విధమైన ఆదేశాలూ లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. పేదలు భరించలేని విధంగా కాలేజీలు ఫీజులు పెంచుతున్నాయి. తక్షణమే నియంత్రణ చేపట్టాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.
– టి.నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

ఫిర్యాదులు వస్తున్నాయి.. పరిశీలిస్తున్నాం

ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల పెంపుపై అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. నియంత్రణ కోసం ఏం చేయాలనేది పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉంది.
– జయప్రదాబాయి, ఇంటర్ బోర్డ్ సీనియర్ అధికారి

'డబుల్' పూర్తయ్యేదెప్పుడో?

- చివరి దశలో ఇళ్ల నిర్మాణ పనులు
- మూడేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- త్వరగా పనులు చేపట్టి అర్హులకు అందజేయాలని విజ్ఞప్తి


రాజంపేటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

రాజంపేట: పేదోడి సొంత ఇంటి కల నెరవేరాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టి అర్హులైన పేద ప్రజలకు కేటాయిస్తోంది. రాజంపేట మండల కేంద్రంలో 50 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి 2020 సెప్టెంబర్ నెలలో ప్రజాప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణానికి గాను రూ.2 కోట్ల 52 లక్షలను కేటాయించారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని జంగంపల్లి, భిక్కనూర్, లింగాయిపలి, తిమ్మకపల్లి తదితర గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయి కొన్ని ప్రాంతాలలో లబ్ధిదారులకు సైతం అందజేశారు. రాజంపేట మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి 3 సంవత్సరాలు కావస్తున్నా నిర్మాణ పనులు ఆలస్యంగానే కొనసాగుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతలేమితో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ చొరవ చూపి నాణ్యతతో త్వరిత గతిన పనులు చేపట్టి అర్హులకు అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

స్పైస్ పార్క్‌కు మోక్షమెప్పుడో..!

- వేల్పూర్ వద్ద 75 ఎకరాలు సేకరించి ప్రహరీ కట్టి వదిలేసిన వైనం
- రైతులకు అందని సేవలు
- కార్యాచరణ ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం

మోర్తాడ్(బాల్కొండ): ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది స్పైస్ పార్క్ పరిస్థితి. పసుపు పంట సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించడానికి నిర్దేశించిన స్పైస్‌పార్క్‌లో ఎలాంటి కార్యాచరణ ప్రారంభించకపోవడంతో నిస్తేజంగా మిగిలిపోయింది. పసుపు బోర్డు ఏర్పాటుపై గతంలో కేంద్రం నాన్చుడు ధోరణి అవలంభించడంతో తామే రైతులను ఆదుకుంటామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే 2016లో స్పైస్ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పసుపు సాగు చేస్తున్న మన జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల్ జిల్లాల రైతులకు అందుబాటులో ఉండేలా స్పైస్ పార్క్‌ను వేల్పూర్ వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 75 ఎకరాల స్థలాన్ని సేకరించి రూ. 30 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్లు గతంలో ప్రకటించారు. ప్రహరీ కట్టి, అంతర్గత సీసీ రోడ్లను నిర్మించారు. షెడ్లు, పసుపు నిలువ కోసం గోదాంలు, రైతుల విశ్రాంతి కోసం గదులు, వ్యాపార లావాదేవీల కోసం దుకాణ సముదాయం, పసుపు ఉత్పత్తుల కోసం చిన్న పరిశ్రమల ఏర్పాటు ఇలా ఎన్నో రకాలుగా స్పైస్ పార్క్‌లో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ ఆరంభించకపోవడంతో పసుపు పంటను రైతులు నిజామాబాద్, మెట్‌పల్లి, సాంగ్లీ మార్కెట్‌లలోనే అమ్ముకుంటున్నారు. స్పైస్ పార్క్ వినియోగంలోకి వస్తే రైతులు ఇక్కడికే పసుపు తరలించడం, వ్యాపారులు తరలివచ్చి కొనుగోళ్లకు పోటీపడడం జరుగుతుందని అందరూ భావించారు. అంతేకాకుండా పసుపు ఉత్పత్తుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చేయడం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేసే అవకాశం ఉండేది. కానీ కేవలం స్పైస్ పార్క్ అనే బోర్డును తగిలించడం తప్ప మరో కార్యక్రమం ఏదీ చేపట్టలేదు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పైస్ పార్క్‌లో కార్యాచరణ ఆరంభించి మేలు చేయాలని రైతులు కోరుతున్నారు.



రైతుల కోసం ఆలోచన చేయాలి



స్పైస్ పార్క్‌లో రైతుల ప్రయోజనాల కోసం ఆలోచన చేయాలి. పసుపు బోర్డు ఏర్పాటు అంశం ఎలా ఉన్నా ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని స్పైస్ పార్క్‌లో పసుపు క్రయ విక్రయాలు ఇతర కార్యక్రమాలను కొనసాగించాలి. రైతుల వద్దకే వ్యాపారులు వస్తే పసుపునకు మంచి ధర లభించే అవకాశం ఉంటుంది.
– గడ్డం శ్రీనివాస్, రైతు నాయకుడు, దొన్కల్

రోడ్డును బాగు చేయించండి

- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు



సదాశివనగర్: రైతుల కోసం వేయించిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి కోతకు గురైంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని భూంపల్లి శివారులో రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు గుండా కరక్‌వాడి గ్రామానికి చేరుకోవచ్చు. కాళేశ్వరం 22వ ప్యాకేజీలో భాగంగా రైతుల భూములను కొనుగోలు చేసి కాలువను రోడ్డు వెంబడి చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. కోతకు గురైన భూమిని బాగు చేయించాలని సంబంధిత అధికారులను గ్రామస్తులు ఫోన్‌లో సంప్రదించగా ప్రస్తుతం తమ శాఖ వద్ద ఎలాంటి నిధులు లేవని, ప్రభుత్వం తమ శాఖకు నిధులు కేటాయిస్తే రోడ్డు నిర్మాణ పనులు చేపడతమని పేర్కొన్నారు. గ్రామ రైతులు రోడ్డు సౌకర్యం లేక పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన వ్యాపారవేత్త సాయిరెడ్డి స్పందించారు. రైతుల కోసం తాను కంకర రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని పేర్కొన్నాడు.

ధాన్యం దళారుల పాలు

- కేంద్రాల్లో ఆలస్యంగా కొనుగోళ్లు
- మధ్యవర్తులకే అమ్మేందుకు మొగ్గు
- ప్రకృతి వైపరీత్యాలకు భయపడుతున్న రైతులు


మిర్జాపూర్‌లో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఆరుగాలం పండించిన ధాన్యం వచ్చే రాబడి దళారుల పాలవుతోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో సొసైటీ అధికారులు జాప్యం చేయడంతో దళారులకు అమ్ముకుని రైతులు మోసపోతున్నారు. దళారుల వద్ద కొనుగోలు కేంద్రాల వద్ద ధరలో వ్యత్యాసం లేకపోవడంతో రైతులు దళారులను నమ్ముతున్నారు. దీనితో కర్ణాటక వంటి ఇతర రాష్ట్రాల్లో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం విక్రయిస్తున్నారు. అయితే దళారులకు రూ.1930 చొప్పున పచ్చి వడ్లు, రూ. 2,200 చొప్పున ఎండినవి తీసుకుంటున్నారు. వీటిలో కూడా తమ చేతి వాటం చూపిస్తూ వారం రోజుల్లో డబ్బు కావాలంటే రూ.ఒక లక్ష నగదుకు రూ. వెయ్యి కోత విధిస్తున్నారు.

కేంద్రాలపై అయిష్టత

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు సకాలంలో పడతాయో లేదో మాయిచ్యర్ వచ్చేసరికి అకాల వర్షాలు పడి నష్ట పోతామన్న భయంతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి మొగ్గు చూపడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర ఏ గ్రేడ్ కు రూ. 2,203,బి గ్రేడ్ కు రూ.22183 ఉన్నా కూడా ఆసక్తి చూపడం లేదు. దలారుల వద్ద ధాన్యం పచ్చివి రూ. 1,900 నుండి రూ. 1,950 క్వింటాలు పలకడంతో ఎండపోసేందుకు కూలీల ఖర్చులు మిగులుతాయని దళారులకే అమ్ముతున్నారు.

రైతుల సొమ్ము భద్రమేనా...

దళారులను నమ్మి రైతులు కాంటా పెడుతున్నారు. అయితే దళారులను నమ్మి రైతులు మోసపోయిన ఘటనలు చాలానే ఉన్నాయి. అయినా కూడా రైతులు విక్రయిస్తున్నారు. దీనితో గతంలో నెలలు గడిచినా కూడా ధాన్యం డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డ ఘటనలు ఉన్నాయి.

నిజామాబాద్ రూరల్ మండలంలో..



నిజామాబాద్ రూరల్: మండలంలోని ముత్తకుంట, గుండారం, మాధవనగర్, జిల్లా కేంద్రంలోని కోటగల్లీ సొసైటీలలో ఈ నెల 1న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. గుండారం, ముత్తకుంట గ్రామాల్లో ధాన్యాన్ని కొంటున్నా.. మాధవనగర్, కోటగల్లీ సొసైటీలలో ఇప్పటి వరకు ఒక్క ధాన్యం బస్తా కొనలేదు. రైతులు ప్రస్తుత రబీ సీజన్‌లో ఎక్కువగా గంగా కావేరి-1 ,2లతో పాటు జైశ్రీరాం సన్నరకం సాగు చేశారు. దళారులు క్వింటాలుకు రూ.2,300 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. 15 రోజుల్లో డబ్బులు రైతులకు చెల్లిస్తున్నారు. అదే సొసైటీలలో మాత్రం ఏ- గ్రేడ్ వరి ధాన్యాన్ని రూ.2183కి మాత్రమే చెల్లించడంతో రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకుంటున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడుస్తుండటంతో మళ్లీ ఎండబెట్టుకుంటున్నారు. ఈ నాలుగు సొసైటీల పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం అమ్మకాలపై నిఘా..

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిఘా పెంచిన ఎక్సైజ్ శాఖ
- పరిమితికి మించి తరలిస్తే కేసులు నమోదు

మోర్తాడ్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ మద్యం అమ్మకాలపై నిఘా పెట్టింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మార్చి 16 నుంచి బెల్టు షాపులకు తాళాలు వేయించిన ఎక్సైజ్ అధికారులు వైన్స్‌ల నుంచి మద్యం ఎటు వెళ్తేందో పక్కాగా నిఘా పెడుతున్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి మద్యాన్ని ఏరులై పారించే రాజకీయ నాయకుల భరతం పట్టేందుకు ఎక్సైజ్ శాఖ దూకుడు పెంచింది. వైన్స్ దుకాణాల నుంచి ఒక వ్యక్తికి నాలుగు బీర్లు లేదా ఒక విస్కీ ఫుల్ బాటిల్ మాత్రమే విక్రయించాలని అధికారులు వ్యాపారులను ఆదేశించారు. పరిమితంగానే మద్యం అమ్మకాలని లేకుంటే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి తరలించేవారిని అరెస్టు చేస్తున్నారు. జిల్లాలోని మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్‌లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 102 వైన్స్ షాపులు ఉన్నాయి. మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ పరిధిలో బార్లు ఉన్నాయి. మద్యం అమ్మకాలపై ఎలాంటి నియంత్రణ లేకపోయినా విచ్చలవిడిగా మద్యం తరలించడాన్ని మాత్రం ఎక్సైజ్ శాఖ అడ్డుకుంటోంది. రోజువారిగా మద్యం అమ్మకాల లెక్కలను ఎక్సైజ్ శాఖ ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తోంది. అంతేకాకుండా మద్యాన్ని రాజకీయ పార్టీలు టోకున కొనుగోలు చేసి నిలువ చేస్తున్నారా లేదా అనే విషయంలోను నిఘా పెంచారు. రహస్యంగా ఎవరైనా మద్యం నిలువ చేస్తే కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ హెచ్చరిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో విచ్చలవిడిగా మద్యం తరలించడాన్ని కట్టడి చేశామని ఎక్సైజ్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పరిమితంగానే కొనుగోలు చేయాలి

మద్యం కొనుగోళ్ల విషయంలో ప్రజలు ఎక్సైజ్ శాఖకు సహకరించాలి. రాజకీయ పార్టీల సూచనలతో ఎక్కువ మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తే సహించేది లేదు. పరిమితికి మించి ఎవరు మద్యం తరలించినా ఉపేక్షించేది లేదు. పక్కాగా కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తాం.
– గుండప్ప, ఎక్సైజ్ సీఐ, మోర్తాడ్